క్లుప్తంగా

విద్యార్థినికి నగదు బహుమతి



మౌళికకు నగదు అందజేస్తున్న పద్మారత్నం

ముత్తుకూరు: మండలంలో పదో తరగతి ఫలితాల్లో అత్యధిక మార్కులు సాధించిన ముత్తుకూరు హైస్కూల్ విద్యార్థిని ఆలపాక మౌళికకు సుబ్బారెడ్డిపాళెం ప్రాథమికోన్నత పాఠశాల తెలుగు పండిట్ సోమా పద్మారత్నం గురువారం నగదు బహుమతి అందజేసి సన్మానించారు. తమ పాఠశాలలో చదివిన మౌళిక పదో తరగతిలో 572 మార్కులు సాధించడం అభినందనీయమని తెలిపారు.

గాయపడిన యువకుడి మృతి

నెల్లూరు(క్రైమ్): బస్సు ఢీకొనడంతో తీవ్రంగా గాయపడిన యువకుడు చికిత్స పొందుతూ గురువారం మృతి చెందారు. సౌత్ ట్రాఫిక్ పోలీసుల సమాచారం మేరకు.. పశ్చిమ బెంగాల్లోని బర్ధమాన్‌కు చెందిన సావిక్ దేవనాథ్ (28) నగరంలోని వివిధ లస్సీ షాపుల్లో మాస్టర్‌గా పనిచేస్తూ అక్కడే నివాసం ఉంటున్నారు. బైక్‌పై వీఆర్సీ మీదుగా ముత్తుకూరు బస్టాండ్ వైపు బుధవారం వెళ్తుండగా, విజయవాడ వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ఢీకొంది. కిందపడిన ఆయనపై బస్సు వెనుక టైరెక్కింది. తీవ్రంగా గాయపడిన ఆయన్ను చికిత్స నిమిత్తం జయభారత్ హాస్పిటల్‌కు, అక్కడి నుంచి జీజీహెచ్‌కు తరలించారు. ఈ క్రమంలో చికిత్స పొందుతూ మృతి చెందారు. సమాచారం అందుకున్న సౌత్ ట్రాఫిక్ పోలీసులు ఆస్పత్రికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. కేసు దర్యాప్తు చేస్తున్నారు.

జీజీహెచ్‌లో మెరుగైన వైద్య సేవలు



నెల్లూరు (అర్బన్): నగరంలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో మెరుగైన వైద్యసేవలను అందించేందుకు అన్ని విభాగాలకు చెందిన హెచ్ఓడీలు చర్యలు చేపట్టాలని ఆస్పత్రి, మెడికల్ కళాశాల అభివృద్ధి కమిటీ కో ఆర్డినేటర్ లక్ష్మీసునంద, ఇన్‌చార్జి సూపరింటెండెంట్ రమేష్ బాబు సూచించారు. దర్గామిట్టలోని ప్రభుత్వ సర్వజన ఆస్పత్రిలో వైద్యశాఖ హెచ్ఓడీలతో గురువారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో రమేష్‌బాబు మాట్లాడారు. డీఎంఈ ఆదేశాల మేరకు ఆర్థోపెడిక్, జనరల్ సర్జరీ, నేత్ర, ఈఎన్టీ, స్కిన్, పల్మనాలజీ, డెలివరీలు, తదితర అన్ని విభాగాల్లో ఆరోగ్యశ్రీ కేసులను పెంచాలని ఆదేశించారు. ఆరోగ్యశ్రీ కేసులు పెరిగితే రోగులకు ఆరోగ్యంతో పాటు ఆస్పత్రికి ఆదాయం చేకూరుతుందని తెలిపారు. స్పందనలో వస్తున్న అర్జీలను సత్వరమే పరిష్కరించాలని సూచించారు. క్యాజువాల్టీ విభాగంలో కొరతగా ఉన్న మెడికల్ ఆఫీసర్ల సమస్యను అధిగమించేందుకు గానూ ఇతర విభాగాల నుంచి తీసుకొచ్చేలా చర్యలు చేపడుతున్నామని వివరించారు. ఆర్ఎంఓ సుబ్రహ్మణ్యం, తదితరులు పాల్గొన్నారు.

లింగ నిర్ధారణకు పాల్పడితే చర్యలు

నెల్లూరు రూరల్: లింగ నిర్ధారణకు పాల్పడే స్కానింగ్ సెంటర్లపై కఠిన చర్యలు తప్పవని వైద్య, ఆరోగ్య శాఖ నెల్లూరు డివిజన్ ప్రోగ్రామ్ అధికారి దయాకర్ పేర్కొన్నారు. లింగ నిర్ధారణపై వివిధ శాఖల అధికారులతో సమావేశాన్ని ఆర్డీఓ మలోల అధ్యక్షతన నగరంలోని ఆర్డీఓ కార్యాలయంలో గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా దయాకర్ మాట్లాడారు. లింగ నిర్ధారణ చట్టాలను సక్రమంగా అమలు చేయాలని సూచించారు. సమాచారం అందిస్తే స్కానింగ్ సెంటర్లపై దాడులు జరిపి చర్యలు చేపడతామని చెప్పారు. అనంతరం మలోల మాట్లాడారు. డివిజన్ పరిధిలోని మండలాల్లో బాల్య వివాహాలను నిరోధించేందుకు అన్ని శాఖలు సమన్వయంతో వ్యవహరించాలని కోరారు. నగర డీఎస్పీ శ్రీనివాసరెడ్డి, వైద్యులు బ్రిజిత, మల్లికార్జున్, రూప, తదితరులు పాల్గొన్నారు.

మలేరియా నివారణకు కృషి

నెల్లూరు (అర్బన్): జిల్లాలో మలేరియా నివారణకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఇన్‌చార్జి డీఎంహెచ్ఓ వెంకటప్రసాద్ పేర్కొన్నారు. జాతీయ మలేరియా నివారణ మాసోత్సవాలను పురస్కరించుకొని సంతపేట, గుప్తా పార్క్, డీఎంహెచ్ఓ కార్యాలయ పరిసర ప్రాంతాల్లో అవగాహన ర్యాలీని వైద్య శాఖ ఉద్యోగులు గురువారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. దోమ కాటుతో మలేరియా, డెంగీ, చికున్ గున్యా, తదితర వ్యాధులొస్తున్నాయని చెప్పారు. ఇంటి పరిసరాల్లో ఖాళీగా ఉండే టెంకాయ చిప్పలు, బాటిళ్లు, నీటి తొట్లు, తదితరాల్లో నీరు నిల్వ ఉండకుండా చూడాలని సూచించారు. దోమల లార్వాలను నశింపజేసేందుకు గానూ ఆయిల్ బాల్స్‌ను వేయాలన్నారు.

ఖరీఫ్ జోరు

సకాలంలో వర్షాలు కురిసి సాగునీరు సమృద్ధిగా ఉండడంతోపాటు రాష్ట్ర ప్రభుత్వం రైతులకు అండగా నిలుస్తోంది. రైతుభరోసా కేంద్రాల ద్వారా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందించడంతోపాటు రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర అందేలా చర్యలు తీసుకుంది. దీంతో పంటల సాగులో రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా అనుకూలంగా మారింది. ఈ క్రమంలో ఈ ఏడాది ఖరీఫ్‌లో వరిసాగు విస్తీర్ణం పెరిగిందని వ్యవసాయశాఖ అధికారులు చెబుతున్నారు.

- పెరిగిన సాగు విస్తీర్ణం
- గతేడాది కన్నా 1,700 హెక్టార్ల పెరుగుదల
- రబీలో స్థిరంగా మద్దతు ధరే ప్రధాన కారణం
- రైతులకు అండగా ప్రభుత్వం

జిల్లాలో..

మొత్తం మండలాలు	- 38
ఖరీఫ్‌లో ఈ ఏడాది వరి సాగు చేస్తున్న మండలాలు	- 33
సాగు విస్తీర్ణం	:34,700
గతేడాది సాగు విస్తీర్ణం	: 33 వేల హెక్టార్లు



నాట్లు వేస్తున్న మహిళా కూలీలు

బుచ్చిరెడ్డిపాళెం: గత రబీలో ధాన్యానికి రాష్ట్ర ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర రూ.18,500 రైతుల పాలిట వరంగా మారింది. కొందరు రైతులు తాము పండించిన ధాన్యాన్ని రైతుభరోసా కేంద్రాల ద్వారా విక్రయించుకోగా, మరికొంతమంది రైతులు బయట మార్కెట్లో ధాన్యాన్ని విక్రయించినప్పటికీ ఎక్కడా మిల్లర్లు మద్దతు ధర తగ్గించకుండా కొనుగోలు చేశారు. దీంతో ఖరీఫ్‌లో కూడా రాష్ట్ర ప్రభుత్వం ధాన్యానికి మంచి మద్దతు ధర ప్రకటిస్తుందన్న ఆశాభావంతో ఎక్కువ మంది రైతులు వరి సాగుకు సిద్ధమయ్యారు.

గరిష్ట స్థాయిలో విస్తీర్ణం

గతంలో ఖరీఫ్‌లో సాగునీటి కష్టాలతోపాటు ధాన్యానికి ధర ఉండదని భావించి రైతులు వరి పంట వేయకపోవడం లేదా ప్రత్యామ్నాయ పంటలను సాగు చేయడం జరిగేది. అయితే ఈ ఏడాది ఖరీఫ్‌లో అందుకు భిన్నంగా ఉంది. సోమశిల, కండలేరు, కనిగిరి రిజర్వాయర్లలో ఖరీఫ్‌కు ఇబ్బంది లేకుండా సాగునీరు ఉండడంతో ఏకంగా 34,700 హెక్టార్లలో వరి సాగు చేసేందుకు రైతులు సన్నద్ధమయ్యారు. అయితే గతేడాది ఖరీఫ్‌లో 33 వేల హెక్టార్లలో వరి సాగు చేయడం గమనార్హం. అంటే ఈ ఏడాది సాగు విస్తీర్ణం పెరిగిందని తెలుస్తోంది.

ఆర్బీకేల ద్వారా అన్ని వసతులు

ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రవేశపెట్టిన రైతుభరోసా కేంద్రాల ద్వారా రైతులకు నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందిస్తున్నారు. అలాగే పంటల సాగులో రైతులకు వచ్చే పలు అనుమానాలను ఆర్బీకే సిబ్బంది నివృత్తి చేస్తారు. అగ్రిల్యాబ్స్‌లో భూసార పరీక్షలు చేస్తున్నారు. వ్యవసాయ విస్తరణాధికారులు రైతుల వద్దకు నేరుగా వెళ్లి ఈకేవైసీ, ఈ–క్రాప్ బుకింగ్ చేయడం ద్వారా పంటల బీమా, రైతుభరోసా, పీఎం కిసాన్ తదితర పథకాల లబ్ధి అందుతోంది.



ట్రాక్టర్‌తో దుక్కి దున్నుతున్న దృశ్యం

ముమ్మరంగా సాగు పనులు

జిల్లావ్యాప్తంగా ఖరీఫ్‌లో వరిసాగు పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. ఈ సీజన్‌లో వ్యవసాయశాఖ అధికారులు ఎన్ఎల్ఆర్–34449, ఎంటీయూ–1010 రకాల వరి వంగడాలను సాగు చేయాలని వ్యవసాయశాఖ అధికారులు రైతులకు సూచిస్తున్నారు. వీటి సాగు కాలపరిమితి దాదాపు 120–140 రోజుల వరకు ఉంటుందని, సాగునీటి విషయంలో కూడా ఈ వరి వంగడాలు అనుకూలంగా ఉంటాయని తెలిపారు. అలాగే వరిసాగులో వివిధ యాజమాన్య పద్ధతులను పాటించాలని అధికారులు సూచిస్తున్నారు.

మద్దతు ధర కారణంగానే ఆసక్తి



గత రబీలో రాష్ట్ర ప్రభుత్వం రైతులకు మేలు చేసింది. రూ.18,500 వరకు మద్దతు ధరను ప్రకటించడంతోపాటు ఆర్బీకేల ద్వారా ధాన్యాన్ని కొనుగోలు చేసింది. బయట మార్కెట్లో కూడా మిల్లర్లు మద్దతు ధర కన్నా తక్కువకు కొనుగోలు చేయకుండా పటిష్ట చర్యలు తీసుకుంది. ఈ కారణంగానే ఖరీఫ్‌లో కూడా మంచి ధర వస్తుందని ఎక్కువ మంది రైతులు వరి సాగు చేస్తున్నారు.

– దాసరి ప్రభాకర్, మినగల్లు

ఆర్బీకేలతో రైతులకు మేలు



రాష్ట్ర ప్రభుత్వం రైతుల కోసం ఏర్పాటు చేసిన ఆర్బీకేల ద్వారా ఎంతో మేలు జరుగుతోంది. అగ్రిల్యాబ్స్ ద్వారా భూసార పరీక్షలతో పాటు ఆర్బీకేల ద్వారా నాణ్యమైన విత్తనాలు, ఎరువులు, పురుగుమందులు అందిస్తున్నారు. పంటల సాగుకు సంబంధించి ఎప్పటికప్పుడు అధికారులు సూచనలిస్తున్నారు. ముఖ్యంగా ధాన్యానికి మద్దతు ధర ఉండడంతో ఖరీఫ్‌లో సాగు విస్తీర్ణం పెరుగుతుంది.

– హర్ష, రైతు, పటేల్‌నగర్

అందుబాటులో అధికారులు



ఆయా మండలాల్లో వ్యవసాయాధికారులు రైతులకు నిత్యం అందుబాటులో ఉంటున్నారు. ముఖ్యంగా ఖరీఫ్ సీజన్‌కు సాగునీరు సమృద్ధిగా ఉంది. అంతేకాకుండా గత రబీలో రైతులు పండించిన ధాన్యానికి మద్దతు ధర ఉండడంతో ఈ ఖరీఫ్‌లో సాగు విస్తీర్ణం పెరిగింది.

– సుధాకర్‌రాజు, జిల్లా వ్యవసాయశాఖ అధికారి

సచివాలయాల తనిఖీ



సచివాలయ ఉద్యోగులతో మాట్లాడుతున్న డీఎల్‌పీఓ ఎం.నారాయణరెడ్డి

పొదలకూరు: పట్టణంలోని బిట్–1, 4 గ్రామ సచివాలయాలను నెల్లూరు ఇన్‌చార్జి డీఎల్‌పీఓ ఎం.నారాయణరెడ్డి గురువారం తనిఖీ చేశారు. ఈ సందర్భంగా సచివాలయాల నిర్వహణ, సేవలను అడిగి తెలుసుకున్నారు. సచివాలయాలకు వచ్చే ప్రజలకు ఉద్యోగులు జవాబుదారీగా ఉంటూ సకాలంలో సేవలను అందించాలని సూచించారు. రికార్డులను పక్కాగా నిర్వహించాలని తెలిపారు. ఆయన వెంట పంచాయతీ కార్యదర్శి ఎస్కే అల్లాభక్షు ఉన్నారు.

బాధ్యతలు చేపట్టిన బాలసుబ్రమణియన్



ముత్తుకూరు: ముత్తుకూరులోని మత్స్యకళాశాలలో నూతన అసోసియేట్ డీన్‌గా డాక్టర్ ఎ.బాలసుబ్రమణియన్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఈ స్థానంలో ఉన్న డాక్టర్ రామలింగయ్య బుధవారం ఉద్యోగ విరమణ చేసిన విషయం తెలిసిందే. ఫిషరీస్ రిసోర్స్ మేనేజ్‌మెంట్ హెడ్‌గా బాధ్యతలు నిర్వహిస్తూ అసోసియేట్ డీన్‌గా బాధ్యతలు స్వీకరించిన డాక్టర్ బాలసుబ్రమణియన్‌కు ఈ సందర్భంగా కళాశాల ప్రొఫెసర్లు అభినందనలు తెలిపారు.

కనులపండువగా వీరభద్రస్వామి కల్యాణం



వీరభద్రస్వామి-భద్రకాళి అమ్మవారి కల్యాణోత్సవం

- వైభవంగా గ్రామోత్సవం
- రూ.3 లక్షలు పలికిన స్వామివారి వడమాల, లడ్డూ రూ.1.75 లక్షలు

మనుబోలు: మండలంలోని శ్రీభద్రకాళి సమేత వీరభద్రస్వామి ఆలయం శత వార్షికోత్సవాల్లో భాగంగా చివరి రోజైన బుధవారం రాత్రి వీరభద్రస్వామి-భద్రకాళి కల్యాణం, గ్రామోత్సవాలను అంగరంగ వైభవంగా నిర్వహించారు. వేదపండితుల మంత్రోచ్చారణల మధ్య స్వామివారికి కలశాభిషేకం, మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, మహాగణపతి పూజ, మూలమంత్ర హోమం, మహా చండీహోమం, పూర్ణాహుతి తదితర కార్యక్రమాలను శాస్త్రోక్తంగా నిర్వహించారు. అనంతరం వీరభద్రస్వామి-భద్రకాళి అమ్మవార్లకు ఆలయ ప్రధానార్చకుడు గంధళ్ల శ్రీనివాసులు శాస్త్రోక్తంగా కల్యాణం జరిపించారు. కల్యాణానికి పెద్ద సంఖ్యలో మహిళలు హాజరయ్యారు. భక్తులకు భారీ సాయిలో అన్నదానం చేశారు. అనంతరం ప్రత్యేక పుష్పాలంకరణ చేసిన వాహనంపై శ్రీవీరభద్రస్వామి-భద్రకాళి అమ్మవార్లను కొలువుదీర్చి వేడుకగా గ్రామోత్సవం నిర్వహించారు. ఈ సందర్భంగా ఉత్సవం వెంట ఏర్పాటు చేసిన తెనాలి బ్యాండ్, బేతాళ నృత్యాలు, ప్రత్యేక వేషధారణలు ఆకట్టుకున్నాయి. స్వామివారికి వేసిన వడమాలను వేలం వేయగా నెల్లూరుకు చెందిన భాగవతుల విజయకృష్ణ-విరంజిని దంపతులు రూ.3 లక్షలకు దక్కించుకున్నారు. అలాగే స్వామివారికి ప్రసాదంగా ఉంచిన లడ్డూను వేలం వేయగా రూ.1.75 లక్షలకు గూడూరు పెంచలయ్య-జ్యోతి దంపతులు దక్కించుకున్నారు. ఈ కార్యక్రమాలకు భాగవతుల విజయ రాఘవేంద్ర-శైలజ, పొట్టి నాగేంద్ర-అనూరాధ దంపతులు ఉభయకర్తలుగా వ్యవహరించారు.



స్వామి, అమ్మవార్లకు గ్రామోత్సవం నిర్వహిస్తున్న భక్తులు

హైస్కూల్ ప్లస్‌లో మరో డిజిటల్ బోర్డు

- డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు



కరపత్రాలు ఆవిష్కరిస్తున్న వీరి చలపతిరావు తదితరులు

కొడవలూరు: మండలంలోని నార్తురాజుపాళెంలో ఉన్న హైస్కూల్ ప్లస్(బాలికల)లో దాత సహకారంతో మరో డిజిటల్ బోర్డు ఏర్పాటు చేస్తున్నట్లు డీసీఎమ్మెస్ చైర్మన్ వీరి చలపతిరావు తెలిపారు. నార్తురాజుపాళెం హైస్కూల్ ప్లస్‌లోని వసతులపై ముద్రించిన ప్రచార కరపత్రాలను ఆ పాఠశాల ప్రాంగణంలో గురువారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతేడాది ఇక్కడ బాలికల కోసం ప్రభుత్వం ఫస్టియర్ ఇంటర్ ప్రారంభించగా విద్యార్థులకు మెరుగైన బోధన అందాలన్న లక్ష్యంతో తాను సొంత నిధులతో డిజిటల్ బోర్డు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ఏడాది నుంచి ఇక్కడి హైస్కూల్ ప్లస్‌లో ఇంటర్ సెకండ్ ఇయర్ కూడా అందుబాటులోకి వచ్చినందున వారికి కూడా డిజిటల్ బోర్డు సదుపాయం కల్పించాలని నిర్ణయించామన్నారు. ఇందుకు దాత, గండవరం సమీపంలోని అల్ఫా మెరైన్ రొయ్యల పరిశ్రమ యజమాని సుధాకర్‌యాదవ్‌ను కోరగా ఆయన సహకరిస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో ఎంపీడీఓ పి.సుబ్రహ్మణ్యం, ఎంఈఓ జి.వసంతకుమారి, హెచ్ఎం డి.ఓబులేసు, అల్ఫా మెరైన్ యజమానులు సుధాకర్‌యాదవ్, మస్తాన్‌నాయుడు, వైఎస్సార్‌సీపీ నాయకులు కొండా శ్రీనివాసులురెడ్డి, ఎండీ కరిముల్లా, బొచ్చు శ్రీనివాసులు, అధ్యాపక బృందం పాల్గొన్నారు.

విద్యతోనే ఉన్నత శిఖరాలు



సత్కారం అందుకున్న విద్యార్థులతో అపస్ నేతలు, హెచ్ఎంలు

బుచ్చిరెడ్డిపాళెం: విద్యతోనే ఉన్నత శిఖరాలకు చేరుకోవచ్చని అపస్ జిల్లా అధ్యక్షుడు కె.రాజగోపాలాచారి అన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో పదో తరగతి చదివి అత్యుత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులను స్థానిక బెజవాడ బుజ్జమ్మ బాలికోన్నత పాఠశాలలో గురువారం అపస్ ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ప్రణాళికబద్ధంగా విద్యనభ్యసిస్తే మంచి ఫలితాలు సాధించవచ్చని తెలిపారు. ముఖ్యంగా ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులు కార్పొరేట్ స్కూళ్ల విద్యార్థులతో సమానంగా ఫలితాలు సాధించడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఇందుకు తల్లిదండ్రుల ప్రోత్సాహం తప్పనిసరిగా ఉండాలని తెలిపారు. కార్యక్రమంలో ఆయా పాఠశాలల హెచ్ఎంలు సుజాత, పీవీ రత్నం, జిల్లా రిసోర్స్‌పర్సన్ గండికోట సుధీర్, ఉపాధ్యాయులు చంద్రమౌళి, సురేంద్రయ్య, మల్లికార్జున, రవి, నారాయణ, మణికంఠరాచారి, హజరత్ పాల్గొన్నారు.

5 నుంచి 'జగనన్నకు చెబుదాం'

వెంకటాచలం: స్థానిక మండల పరిషత్ కార్యాలయంలోని సమావేశ మందిరంలో ఈ నెల 5వ తేదీ నుంచి 'జగనన్నకు చెబుదాం' కార్యక్రమం ప్రతి సోమవారం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ కార్యాలయ ఏఓ ముజీబున్నీసా గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఉదయం 10.30 నుంచి మధ్యాహ్నం 1.30 గంటల వరకు ఈ కార్యక్రమం నిర్వహిస్తామని తెలిపారు. అన్నిశాఖల మండల స్థాయి అధికారులు ఈ కార్యక్రమానికి హాజరవుతారని, ప్రజలు తమ సమస్యలపై అర్జీలిచ్చి పరిష్కరించుకోవాలని తెలిపారు.

ఆధార్ కేంద్రం పరిశీలన

పొదలకూరు: పట్టణంలోని ఆధార్ కేంద్రాన్ని డివిజనల్ డెవలప్‌మెంట్ ఆఫీసర్ వసుమతి గురువారం పరిశీలించారు. ఆధార్ కేంద్రంలో నమోదవుతున్న వివరాలను అడిగి తెలుసుకున్నారు. పక్కనే ఉన్న అంగన్‌వాడీ కేంద్రంలో ప్రీస్కూల్ పిల్లలకు కూడా ఆధార్ నమోదు కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు తెలిపారు. అంగన్‌వాడీ కార్యకర్తలు ఆయా కేంద్రాల్లోని పిల్లలకు ఆధార్ నమోదు చేయించాలని సూచించారు.

నూతన ఎస్సై బాధ్యతల స్వీకరణ



తోటపల్లిగూడూరు: స్థానిక పోలీస్‌స్టేషన్‌లో నూతన ఎస్సైగా జంపాని కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇక్కడ ఎస్సైగా పనిచేస్తున్న ఇంద్రసేనారెడ్డి ఇటీవల ఉదయగిరి పోలీస్‌స్టేషన్‌కు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నెల్లూరు ట్రాఫిక్ సౌత్ విభాగంలో పనిచేస్తున్న జంపాని కుమార్ తోటపల్లి గూడూరు ఎస్సైగా నియమితులయ్యారు. ఈ సందర్భంగా ఎస్సై జంపాని కుమార్ మాట్లాడుతూ మండలంలో శాంతిభద్రతల పరిరక్షణకు కృషి చేస్తానన్నారు.

అదనపు కట్నం కోసం వేధింపులు

బుచ్చిరెడ్డిపాళెం: అదనపు కట్నం కోసం భర్త, ఆడపడుచులు వేధిస్తున్నట్లు బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన మునగపాటి ప్రమీల ఫిర్యాదు చేయగా గురువారం పోలీసులు కేసు నమోదు చేశారు. ఎస్సై వీరప్రతాప్ కథనం మేరకు బుచ్చిరెడ్డిపాళేనికి చెందిన ప్రమీలకు కోవూరుకు చెందిన మునగపాటి వెంకటసతీష్‌కుమార్‌కు 2021లో వివాహమైంది. ఆ సమయంలో కట్నం కింద నగదు, బంగారు ఆభరణాలు అందించారు. అయితే గత కొన్ని రోజుల నుంచి భర్త వెంకటసతీష్‌కుమార్‌తోపాటు ఆడపడుచులు అదనపు కట్నం కోసం ప్రమీలను మానసికంగాను, శారీరకంగానూ హింసించేవారని తెలిపారు. ఈ మేరకు కేసు నమోదు చేసినట్లు ఎస్సై తెలిపారు.

రిజిస్ట్రేషన్ శాఖలో బదిలీలు

నెల్లూరు సిటీ: జిల్లా రిజిస్ట్రేషన్ శాఖలో ముగ్గుర్ని బదిలీ చేస్తూ ఉత్తర్వులను రాష్ట్ర ప్రభుత్వం గురువారం జారీ చేసింది. రాపూరు సబ్ రిజిస్ట్రార్ నందకిషోర్‌ను డీఐజీ కార్యాలయ సూపరింటెండెంట్‌గా బదిలీ చేశారు. పొదలకూరు సబ్ రిజిస్ట్రార్ సుమలతను నాయుడుపేటకు, అక్కడి సబ్ రిజిస్ట్రార్ శోభమ్మను పొదలకూరుకు బదిలీ చేశారు.

విద్యుత్ సరఫరా పునరుద్ధరణ పనులు



రామమందిరం వీధిలో మరమ్మతులు చేస్తున్న సిబ్బంది

పొదలకూరు: ఇటీవల కురిసిన గాలివానకు పొదలకూరు పట్టణం, చుట్టుపక్కల ప్రాంతాల్లో చెట్లు కూలి.. విద్యుత్ స్తంభాలు ఒరిగి.. తీగలు తెగిపడిన నేపథ్యంలో విద్యుత్ అధికారులు, సిబ్బంది రెండు రోజులుగా పునరుద్ధరణ పనులు చేస్తున్నారు. బుధవారం నాటికే చాలావరకు విద్యుత్ పునరుద్ధరణ పనులను పూర్తి చేసి విద్యుత్‌ను యథావిధిగా సరఫరా చేశారు. ఇందుకోసం పంచాయతీ అధికారులు, పాలకమండలి కూడా సహకారం అందించారు. గురువారం కూడా ఆ శాఖ సిబ్బంది విద్యుత్ పునరుద్ధరణ పనులు చేపట్టారు.

చాముండేశ్వరీదేవికి పులి వాహనోత్సవం



పులివాహనంపై ఊరేగుతున్న అమ్మవారు

ఇందుకూరుపేట: బ్రహ్మోత్సవాలను పురస్కరించుకొని మండలంలోని గంగపట్నం శ్రీచాముండేశ్వరీదేవి అమ్మవారు గురువారం పులివాహనంపై విహరిస్తూ భక్తులను కటాక్షించారు. విశేష పుష్పాలంకరణ, మేళతాళాల మధ్య ఊరేగుతున్న అమ్మవారికి భక్తులు నైవేద్యాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. ఈ కార్యక్రమానికి స్థానిక పల్లికాపులు ఉభయదాతలుగా వ్యవహరించారు. ఉదయం జరిగిన చప్పర ఉత్సవానికి వైశ్యులు ఉభయదాతలుగా ఉన్నారు. అర్చకులు అనిల్‌స్వామి, రామకృష్ణస్వామి, కిషోర్‌స్వామి ఆధ్వర్యంలో ఈ పూజలు జరిగాయి. ఉత్సవాల సందర్భంగా గ్రామంలో కోలాహలం నెలకొంది.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట మహోత్సవం



మల్లికార్జునస్వామికి ప్రత్యేక పూజలు చేస్తున్న అర్చకులు

పొదలకూరు : మండలంలోని మరుపూరు శ్రీకామాక్షి సమేత మల్లికార్జునస్వామి ఆలయంలో గురువారం విగ్రహ ప్రతిష్ట మహోత్సవం అత్యంత వైభవంగా నిర్వహించారు. ఉదయం యంత్రప్రతిష్ట, విగ్రహ ప్రతిష్ట, సూత్రసంధానం, ప్రాణప్రతిష్ట చేశారు. ధ్వజ స్తంభ ప్రతిష్ట, కుంభాభిషేకం, శ్రీమల్లికార్జునస్వామి శాంతికల్యాణం, భక్తులకు అన్నదాన కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయ నిర్మాణ కమిటీ సభ్యులు ఏర్పాట్లను పర్యవేక్షించారు. ఈ పూజా కార్యక్రమాల్లో రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్ పరిశీలన



ప్లాంట్‌ను పరిశీలిస్తున్న కమిషనర్, అసిస్టెంట్ కలెక్టర్

పొదలకూరు: నెల్లూరు నగరానికి మంచినీటిని సరఫరా చేస్తున్న పొదలకూరు మండలం మహ్మదాపురం వాటర్ ట్రీట్మెంట్ ప్లాంట్‌ను నగరపాలక సంస్థ కమిషనర్ వికాస్ మర్మత్, అసిస్టెంట్ కలెక్టర్ విద్యాధరి గురువారం పరిశీలించారు. ఈ సందర్భంగా సంగం ఆనకట్టపై నిర్మించిన ఇంటెక్‌వెల్, మహ్మదాపురం కొండపై నిర్మించిన 122 ఎంఎల్‌డీ సామర్థ్యం కలిగిన ట్రీట్మెంట్ ప్లాంట్, క్లియర్ వాటర్ సంప్, పంప్‌హౌస్ తదితర నిర్మాణాలు, వాటి పనితీరును పరిశీలించారు. ఈ సందర్భంగా వేసవిలో నీటి ఎద్దడి లేకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని కమిషనర్ అధికారులను ఆదేశించారు. వారి వెంట పబ్లిక్‌హెల్త్ ఈఈ అలీ, నగరపాలక సంస్థ ఈఈ సంజయ్, సిబ్బంది ఉన్నారు.

చిన్నారులకు పౌష్టికాహారం అందించాలి

- డీఎల్‌డీఓ కనకదుర్గాభవాని



చిన్నారుల బరువు పరిశీలిస్తున్న డీఎల్‌డీఓ కనకదుర్గా భవాని

కొడవలూరు: అంగన్‌వాడీ కేంద్రాలకు వచ్చే చిన్నారులకు పౌష్టికాహారం తప్పనిసరిగా అందించాలని కావలి డీఎల్‌డీఓ కనకదుర్గాభవాని సూచించారు. కలెక్టర్ ఆదేశాల మేరకు అంగన్‌వాడీ కేంద్రాల్లోని చిన్నారుల బరువు, ఎత్తులను ప్రతి నెలా ఒకటో తేదీ నుంచి 10వ తేదీ వరకు పరిశీలించనున్నట్లు తెలిపారు. కొడవలూరులోని అంగన్‌వాడీ కేంద్రాన్ని గురువారం ఆమె సందర్శించి చిన్నారుల ఎత్తు, బరువులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రతి నెలా చిన్నారుల ఎత్తు, బరువులను పరిశీలించడం ద్వారా పిల్లల్లో ఎదుగుదలను గుర్తించవచ్చన్నారు. కేంద్రాల్లోని ప్రతి చిన్నారి పుట్టిన తేదీ సర్టిఫికెట్ విధిగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఈఓపీఆర్డీ వి.నాగరాజు, పంచాయతీ కార్యదర్శి జి.రాధాకృష్ణ, వెల్ఫేర్ అసిస్టెంట్ బాలకృష్ణ, ఏఎన్ఎం సుభాషిణి, సచివాలయ ఉద్యోగులు పాల్గొన్నారు.